సాక్షి పెద్దపల్లి

గురువారం : 16 : మే : 2024



తోటలో పేలిన తూటా

సిరిసిల్ల : తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష చాటిన 'జనశక్తి' వీరన్న ఎన్‌కౌంటర్‌కు పాతికేళ్లు పూర్తయ్యాయి.

- 8లో ▸



డీజిల్ ట్యాంకర్ పడి ఒకరి దుర్మరణం

శంకరపట్నం : రోడ్డు పక్కన ఉన్నవారిపై డీజిల్ ట్యాంకర్ పడిన ఘటనలో ఒకరు దుర్మరణం చెందా. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.7/33.3

ఆకాశంలో అప్పుడప్పుడు మేఘాలు ఏర్పడతాయి. పగలు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేగంగా ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పెద్దపల్లిరూరల్: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి వారంలోగా పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన ధాన్యం కొనుగోళ్ల తీరుపై సమీక్షించారు. ఇప్పటివరకు 2,11,449 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇంకా 70వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. అన్‌లోడ్ చేసే సమయంలో రైతులను ఇబ్బంది పెట్టేలా కోతలు విధిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఆర్డీవో రవీందర్, డీఎస్‌వో ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతితోనే మట్టి తవ్వకాలు



మాట్లాడుతున్న మైనింగ్ ఏడీ శ్రీనివాస్

కమాన్‌పూర్(మంథని): జూలపల్లి పెద్దచెరువులో అనుమతితోనే మట్టి తవ్వకాలు సాగుతున్నాయని జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మట్టి తవ్వకాలు చేపట్టారనే ఫిర్యాదు మేరకు ఏడీ బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. పెద్దపల్లి సమీపంలోని ఇటుకల తయారీ కంపెనీ 20వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం కోసం దరఖాస్తు చేయగా, అనుమతి మంజూరైందని తెలిపారు. అయితే, ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మట్టి తరలించాలని, రాత్రి వేళ తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని ఏడీ హెచ్చరించారు. ఆయన వెంట నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

కార్మికులకు మెరుగైన సేవలు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం కోసం ఎంతోకృషి చేశామని, గత రెండేళ్లలో మెరుగైన సేవలు అందించామని కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య అన్నారు. బుధవారం కంపెనీ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు గ్రేడ్ ప్రమోషన్, లోడింగ్ కార్మికులకు వేజ్‌బోర్డు కార్మికులుగా పదోన్నతి, ఒకేసారి దీపావళి బోనస్ చెల్లింపు, రిటైర్డ్ కార్మికులకు 3 వస్తువులు, 25మంది కాంట్రాక్ట్ కార్మికులకు బేసిక్ అగ్రిమెంట్ చేసినట్లు ఆయన వివరించారు. గతంలో ఏ యూనియన్ చేయని విధంగా పెండింగ్ సమస్యలు పరిష్కరించామని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాల్వ అంజయ్య యాదవ్, దాడి పోశమల్లు యాదవ్, ముల్కల రాజేశం, తిప్పని శ్రీనివాస్, సూర సంతోష్, ఎరుకలి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


కవి రాకుమారకు రాష్ట్రస్థాయి పురస్కారం



రాకుమార

కోల్‌సిటీ(రామగుండం): రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కవితల పోటీల్లో గోదావరిఖని నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత రాకుమార మరోసారి తన ప్రత్యేకత చాటుకున్నారు. సాయుధ తెలంగాణ పోరాట యోధుడు కర్క ముత్తారెడ్డి స్మారకార్థం వసుంధర విజ్ఞాన వికాస మండలి నిర్వహించిన పోటీల్లో రాకుమార రాసిన 'నేను - నాదేశం' కవితకు బహుమతి లభించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు మధుకర్ వైద్యుల తెలిపారు. హైదరాబాద్‌లో త్వరలో జరిగే సంస్థ 31వ వార్షికోత్సవంలో పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

మల్లన్న స్వామికి ఎండ ఎఫెక్ట్



గుడి పరిసరాల్లో భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామిపై ఎండల ఎఫెక్ట్ పడింది. కొద్దిరోజులుగా ఎండలు దంచికొడుతుండడంతో భక్తుల రాక తగ్గింది. బుధవారం కూడా భక్తుల తగ్గడంతో ఆలయం బోసిపోయి కనిపించింది. ఎండల తీవ్రత, వడగాల్పుల ధాటికి దూరప్రాంతాలకు చెందిన భక్తులు రాలేక పోతున్నారు. దాదాపు పదిరోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రెండువారాల నుంచి భక్తుల రాక తగ్గిందని ఆలయ సిబ్బంది చెబుతున్నారు.

వెంట తిరిగి.. హ్యాండిచ్చి..

- కొంపముంచిన కోవర్టులు!
- అంతర్గత సమావేశాలు, సమీక్షలో తేల్చిన నేతలు
- సైలెంట్ ఓటింగ్‌తో టఫ్ ఫైట్‌గా మారిన వైనం
- పార్లమెంట్ ఎన్నికలపై పోస్ట్‌మార్టం

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో కోవర్టులు కొంపముంచారనే ప్రచారం ఆయా పార్టీల అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. పోలింగ్‌కు ముందు అభ్యర్థులు వేసుకున్న గెలుపోటముల అంచనాలను సైతం వీరు తారుమారు చేశారనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. విజయావకాశాలపై ఎవరి వారు ధీమా వ్యక్తం చేస్తున్నా అభ్యర్థులను లోలోపల కోవర్టుల తీరు కలవరపాటు కలిగిస్తోంది. సాధారణంగా ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే క్రాస్ ఓటింగ్‌కు ఆస్కారం ఉంటుంది. ఒక పార్టీకి చెందిన ఎంపీ అభ్యర్థికి ఒక ఓటు వేస్తే.. మరోపార్టీకి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థికి ఇంకో ఓటు వేస్తారు. అలాగే కొందరు పార్టీలోనే ఉంటూ కోవర్టు రాజకీయాలతో ప్రత్యర్థి పార్టీలకు ఓటు వేయాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తుంటారు. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తుంటాయి. కానీ, ఈసారి పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో గతానికి భిన్నంగా అన్ని పార్టీల్లోని కొందరు(కోవర్టులు) ఒక పార్టీ వైపు మొగ్గుచూపినట్లు పోలింగ్ సరళిపై నిర్వహించిన సమీక్షల్లో తేలడంతో నేతల్లో ఆందోళన మొదలైంది. పోలింగ్ శాతం అధికంగా నమోదైన స్థానాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అనుచరులే..

రాత్రింబవళ్లు తమవెంటే తిరిగి ప్రచారం చేసిన కొందరు నేతలు, పోలింగ్ జరిగిన రోజున పలానా పార్టీకే ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించి హ్యాండ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనికితోడు గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే సుమారు 10శాతం పోలింగ్ తక్కువ నమోదైంది. దీంతో ఎవరిని విజయం వరిస్తుంది, ఎవరు పరాజయం పాలవుతారనే దానిపై లెక్కలు కడుతున్నారు. రెండు నెలల పాటు ప్రచారం హోరెత్తితే.. ఫలితం వచ్చేందుకు మిగిలిన 20రోజుల పాటు ఎదుర్కొనే ఉత్కంఠ ఒక ఎత్తుని అని కొందరు నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

అంతుచిక్కని లెక్కలు.. ఆందోళనలో నేతలు

రూరల్, పట్టణ ఓటర్లు, లబ్ధిదారులు, వృద్ధులు, మహిళలు, మైనార్టీలు, దళితులు, బీసీలు.. ఇలా వర్గాల వారీగా ఎటువైపు మొగ్గుచూపారని నేతలు లెక్కలు తీస్తున్నారు. క్షేత్రస్థాయిలో నుంచి వస్తున్న ఫీడ్ బ్యాక్‌తో అన్నిపార్టీల్లో కోవర్టులు ఉన్నట్లు తేల్చుతున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకు బీజేపీ వైపు మళ్లిందనే ప్రచారం ఉంది. పెద్దపల్లిలో బీజేపీలోని ఒక వర్గం ఓటు బ్యాంకు కాంగ్రెస్ వైపు మళ్లినట్లు ప్రచారంలో ఉంది. మరో వైపు టీబీజీకేఎస్ నేతలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓట్లు వేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు.. డబ్బులు కావాలని ఓటర్ల నుంచి వచ్చిన ఒత్తిడి తట్టుకోలేక పైనుంచి డబ్బులు రాలేదని, ఇష్టం వచ్చిన పార్టీకి ఓట్లు వేసుకోవాలని కాంగ్రెస్‌లోని ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఇలాగే చెప్పినట్లు తెలుస్తోంది.

సైలెంట్ ఓటింగ్.. టఫ్ ఫైటింగ్

ఓటరు నాడీ పట్టేందుకు నేతలు తంటాలు పడుతున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీల్లో సైలెంట్ ఓటింగ్ ఎవరికి అనుకూలం? ఎవరికి ప్రతికూలమనేది అంతుచిక్కడం లేదు. ఏ ఇద్దరు కలిసినా మోదీ హవా పనిచేసిందా? బీజేపీ వైపు మొగ్గు చూపారా? అనే చర్చ సాగుతోంది. అభ్యర్థిని కాకుండా మోదీ క్రేజ్‌తో మహిళలు, వృద్ధులు, యువత చేసిన సైలెంట్ ఓటింగ్ బీజేపీ కలిసొచ్చే అవకాశం ఉందనే ప్రచారం కూడా సాగుతోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎంపీ ఎన్నికల్లో కనిపించలేదని చెబుతున్నారు. అసెంబ్లీ స్థానాల్లో పోటాపోటీగా సొమ్ము పంచడంతోపాటు ప్రభుత్వ వ్యతిరేకత కాంగ్రెస్‌కు కలిసిసోచింది. కానీ, లోక్‌సభ ఎన్నికలు జాతీయ అంశాల ఆధారంగా జరగటంతో ఓటర్లు అటువైపే మొగ్గు చూపారనే విశ్లేషణ తెరపైకి వస్తోంది. ఏదేమైనా క్రాస్‌ఓటింగ్ అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపుతుందనేది అంచనా. అయితే ఇది బీజేపీకి అనుకూలమా, లేక కాంగ్రెస్‌కు అనుకూలమా ?బీఆరఎస్‌కు ప్రయోజనం చేకూర్చుతుందా? అనేది జూన్ 4 వరకు వేచి చూస్తేనే తెలుస్తుంది.

ఎత్తిపోతలు ఇప్పట్లో లేనట్లే..

- కాళేశ్వరం ప్రాజెక్టులో నిలిచిన పంపింగ్
- మరో పదిరోజుల్లో వర్షాకాల సీజన్ ప్రారంభం



నిరుపయోగంగా పార్వతీ పంపుహౌస్

రామగుండం: గోదావరి నదిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి ఎత్తిపోతలకు ఇప్పట్లో అవకాశం లేదని తెలుస్తోంది. ప్రాజెక్టు లోపాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇంజినీర్ల నివేదిక ఆధారంగా ప్రభుత్వం చేపట్టిన విచారణ వేగవంతంగా సాగడం, పునరుద్ధరణ పనులు చేపట్టడం సాధ్యం కాదని నిర్మాణ సంస్థ ప్రకటించడం, మరో పదిరోజుల్లో వర్షాకాల సీజన్ ప్రారంభం కానుండడం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయని అంటున్నారు.

మూడో పంపు గోలివాడ..

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–1లో మూడోది పార్వతీ(గోలివాడ) పంపుహౌస్. దీనినుంచి ఎత్తిపోతలు ప్రారంభించి గతేడాది డిసెంబర్ 19వ తేదీ నాటికి ఆరేళ్లు పూర్తయ్యింది. 2017 డిసెంబర్ 16న భూమిపూజ చేశారు. 2018 డిసెంబర్‌లోనే ఎత్తిపోతలు ప్రారంభించారు.

పంపుహౌస్ ప్రత్యేకత ఇది..

గోలివాడ పంపుహౌస్ నిర్మాణానికి రూ.1,737.56 కోట్లు వెచ్చించారు. గోదావరి నదిపై నిర్మించిన నిర్మించిన ఎల్లింపల్లి ప్రాజెక్టులోకి రోజూ 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా దీనిని డిజైన్ చేశారు. తొలివిడతలో ఆస్ట్రియా, ఫిన్‌లాండ్‌కు చెందిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన తొమ్మిది విద్యుత్ మోటార్లను బిగించారు. 40 మీటర్ల ఎత్తులోని ఎల్లంపల్లిలోకి ఎత్తిపోశారు. వీటిని 24 గంటలపాటు రన్‌చేస్తే 656 క్యూసెక్కులు(2టీఎంసీలు) ఎత్తిపోసేందుకు 360 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఇందు కోసం మెగా కంపెనీ ఆధ్వర్యంలో 400 కేవీ సామర్థ్యంగల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసింది. పార్వతీ బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 8.83 టీఎంసీలు.

ఏడు నెలల క్రితం ఎత్తిపోతల నిలిపివేత..

మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీ కుంగడంతో దాని ఎగువన ఉన్న గోలివాడ, సుందిళ్లతోపాటు మేడిగడ్డ బ్యారేజీల్లోని నీటిని ఖాళీ చేయించారు. సుమారు ఏడునెలల క్రితం నీటిని ఖాళీచేయించి ఎత్తిపోతలు నిలిపివేశారు. గోదావరి నదిపై నిర్మించిన మూడు బ్యారేజీల్లోని నీటిని ఖాళీ చేయించడంతో అందులోని చేపల సంపద లేకుండాపోయింది. ఫలితంగా చేపలవేటపై ఆధారపడ్డ వేలాది మంది మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. అంతేకాదు.. ఎత్తిపోతలు ప్రారంభించే ప్రతీ డిసెంబర్‌లో పర్యాటకుల సందడి ఈసారికూడా లేకుండా పోతుందనే చర్చ సాగుతోంది. చాలాకాలం పాటు మోటార్లను రన్ చేయకుంటే తుప్పు పట్టే అవకాశం ఉందని ఇంజినీర్లు చెబుతున్నారు.

టీబీజీకేఎస్ నాయకుల ఆగడాలతోనే బీఆర్‌ఎస్ ఓటమి

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మధు

రామగిరి(మంథని): టీబీజీకేఎస్ నాయకుల ఆగడాలతోనే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలైందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ధ్వజమెత్తారు. సెంటనరీకాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో టీబీజీకేఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న సమయంలో కార్మికుల పక్షాన పోరాడాల్సిన నాయకులు.. వారిని పట్టించుకోలేదని మండిపడ్డారు. గత పదేళ్లలో సింగరేణి కార్మికులకు కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, అయితే, టీబీజీకేఎస్ నాయకుల అవినీతి, అక్రమాలతో బీఆర్‌ఎస్‌కు కార్మికులు దూరమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి గుర్తింపు కార్మిక ఎన్నికల సందర్భంగా టీబీజీకేఎస్ నాయకులు పోటీకి దూరంగా ఉన్నారని, కొందరు రాజీనామా చేశారని తెలిపారు. గతంలో రద్దు చేసిన పదవులపై కేసీఆర్, కేటీఆర్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. టీబీజీకేఎస్ అధ్యక్ష, కార్యదర్శులమని చెప్పుకొని తిరుగుతున్న నాయకులకు బీఆర్‌ఎస్ పార్టీతో సంబంధం లేదని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీకి అమ్ముడుపోయే నాయకులు టీబీజీకేఎస్ పేరిట మళ్లీ కార్మికుల వద్దకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్, నాయకులు జక్కు రాకేశ్, పూదరి సత్యనారాయణగౌడ్, మ్యాదరబోయిన కుమార్ యాదవ్, దర్ముల రాజసంపత్, దేవ శ్రీనివాస్, గండి శ్రీనివాస్, కస్నూరి శ్రీశైలం, ఆసం తిరుపతి పాల్గొన్నారు.

పరిహారం చెల్లించండి



లారీలను అడ్డుకుని నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్తులు

- ఒప్పందం అమలు చేయండి
- ఈసాలతక్కళ్లపల్లి గ్రామస్తుల డిమాండ్
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని విన్నపం

పాలకుర్తి(రామగుండం): గతంలో తమతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి తక్షణమే పరిహారం చెల్లించాలని ఈసాలతక్కళ్లపల్లి గ్రామస్తులు, నాయకులు డిమాండ్ చేశారు. బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని ప్రైవేట్ కాంట్రాక్టర్ గోప్ప అయిలయ్య యాదవ్‌కు చెందిన వాహనాలను బుధవారం వారు అడ్డుకున్నారు. పరిశ్రమలోని కాంట్రాక్టర్ అయిలయ్య యాదవ్ వద్ద ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కోడిపుంజుల రాజు లారీ డ్రైవర్‌గా పనిశాడని తెలిపారు. అయితే, విధి నిర్వహణలో భాగంగా మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు దుర్మరణం చెందాడని అన్నారు. ఆ సమయంలో మృతుడి కుటుంబానికి రూ.18లక్షల పరిహారం చెల్లించేందుకు అయిలయ్య యాదవ్ అంగీకరించారని గుర్తుచేశారు. మూడేళ్లు గడిచినా పైసా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు రాజు కుటుంబసభ్యులతోపాటు స్థానికులు అయిలయ్యకు చెందిన వాహనాలు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. కేశోరాం సిమెంట్ పర్మినెంట్ యూనియన్ నాయకులు ఆందోళనకారులకు మద్దతుగా నిలిచారు. రాజు కుటుంబానికి పరిహారం చెల్లించే వరకూ ఆందోళన విరమించేదిలేదని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, నాయకులు, గ్రామస్తులు అన్నవేని నగేశ్, ఓడ్నాల రాజు, మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డాడ్జిబాల్ జాతీయస్థాయి పోటీలు

- ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ నర్సింహారెడ్డి



క్రీడలు వివరాలు వెల్లడిస్తున్న నర్సింహారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు జాతీయస్థాయి డాడ్జిబాల్ పోటీలు నిర్వహిస్తామని ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ నర్సింహారెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందుతున్న క్రీడల్లో డాడ్జిబాల్ ఒకటన్నారు. సింగరేణి సహకారంతో తెలంగాణ డాడ్జిబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు చేపట్టామన్నారు. తొలిసారి వివిధ రాష్ట్రాల నుంచి 20జట్లు హాజరవుతాయని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన రెండు జట్లు ఎంపికచేసి వచ్చే ఆగస్టు 11 నుంచి 17వ తేదీ వరకు ఆస్ట్రియా దేశంలో నిర్వహించే అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని ఆయన వెల్లడించారు. 12 మంది క్రీడాకారులతో 20 నిమిషాల వ్యవధిలో నిర్వహించే ఈక్రీడ అత్యంత ఆసక్తికరంగా ఉంటుందని ఆయన వివరించారు. అసోసియేషన్ తెలంగాణ కార్యదర్శి పాశం శ్రీనివాస్, రెఫరీ బోర్డు చైర్మన్ సత్యనారాయణ, ప్రతినిధులు రవీందర్, సతీశ్, ఓదెలుయాదవ్, శ్రీరాములు పాల్గొన్నారు.



బీర్.. నో స్టాక్

జిల్లాలోని వివిధ మద్యం దుకాణాల్లో బీర్ల కొరత ఏర్పడింది. ఎండల తీవ్రతతో చాలామంది మద్యం ప్రియులు బీర్లు తెగ తాగేస్తున్నారు. రోజూ నాలుగైదు కాటన్ల స్టాక్ వస్తే.. ఒకట్రెండు గంటల్లోనే అమ్ముడవుతున్నాయని యజమానులు చెబుతున్నారు. దీంతో బీర్ల స్టాక్ లేదంటూ చాలామంది వైన్స్ షాపుల నిర్వాహకులు ఇలా 'బీర్.. నో స్టాక్' బోర్డు పెడుతున్నారు. వీటిని చూసి మద్యం ప్రియులు ఒకింత నిరాశకు గురవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

2.11 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- వారంలోగా సేకరణ పూర్తి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైతులు ఈ యాసంగిలో పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశారు. ఇందుకోసం ఐకేపీ ఆధ్వర్యంలో 53, సహకార సంఘాల ద్వారా 240 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 2,11,449 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అందులో 2,10,196మెట్రిక్ టన్నులను రైస్‌మిల్లులకు తరలించారు. 21,957మంది రైతులకు చెందిన 1,52,383మెట్రిక్ టన్ను ధాన్యం డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వారంలోగా పూర్తిచేసేలా అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఈమేరకు కొనుగోళ్లు వేగవంతం చేశారు.

కలుషితం.. అనారోగ్యం

- ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ప్లాంట్ పనుల్లో జాప్యం
- కార్మిక కాలనీలకు అందని స్వచ్ఛమైన తాగునీరు



భూమిపూజ చేస్తున్న సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, అధికారులు(ఫైల్)



రెండు నెలల తర్వాత ప్రారంభమైన పనులు

గోదావరిఖని: రామగుండం నగరంలోని సింగరేణి కార్మిక కుటుంబాలకు సమీప గోదావరి నది నుంచి పంపింగ్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీ కాలనీ తదితర కాలనీల్లో నివాసం ఉండే కార్మిక కుటుంబాలకు రోజూ 35ఎంఎల్‌డీ నీరు అందిస్తున్నారు. ఇందుకోసం నదిలో ఫిల్టర్లు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఫిల్టర్‌బెడ్ వరకు తరలించి.. భారీ విద్యుత్ మోటార్లతో నేరుగా కార్మికవాడలకు అందిస్తున్నారు. మూడేళ్ల క్రితం వరకు ఈ ప్రక్రియ సాఫీగానే సాగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో నీటి సరఫరాలో సమస్యలు మొదలయ్యాయి. బ్యాక్ వాటర్‌తో నదిలో నీటినిల్వలు భారీగా పెరిగాయి. ఏడాది పొడవునా నదిలో నీటి నిల్వలు ఉండడం, నగరంలోని వివిధ ప్రాంతాల్లోంచి విడుదలయ్యే మురుగునీరు, ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడే రసాయనాలు కలిసిన నీరు నేరుగా గోదావరి నదిలో కలుస్తుండడంతో నది నీరు కలుషితమవుతోంది. ఈనీటిన తాగిన కార్మిక కుటుంబాలు డయేరియా, మలేరియా, ఇతరత్రా ప్రాణాంతక వ్యాధులకు గురయ్యారు. వర్షాకాలంలో మురికినీరు రావడంతో ఎందుకూ పనికిరాకుండాపోయింది.

హైదరాబాద్‌కు 'భగీరథ' ద్వారా సరఫరా

- గోదావరిఖని సమీపంలోని గోదావరి నదిలో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్లు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ అధికారులు.. వీటి ద్వారా హైదరాబాద్‌కు తాగునీరు సరఫరా చేస్తున్నారు.
- గోదావరి నదిలోని ఇదే ప్రాంతం నుంచి సమీప సింగరేణి కార్మిక కుటుంబాలకు మాత్రం కలుషిత నీరు సరఫరా అవుతోంది.
- తద్వారా కార్మికులు, వారి కుటుంబసభ్యులు కలుషిత నీరు తాగి అనారోగ్యాల బారినపడుతున్నారు.
- హైదరాబాద్ తరహాలోనే స్థానికులమైన తమకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కొద్ది నెలలుగా డిమాండ్ వస్తోంది.
- సమాచారం అందుకున్న అప్పటి సింగరేణి సీఎండీ శ్రీధర్.. మిషన్ భగీరథ తరహాలోనే ర్యాపిడ్ గ్రావిటీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- ఇందుకోసం రెండేళ్ల క్రితమే నిధులు మంజూరు చేశారు.
- సాంకేతిక కారణాలతో అవి నిలిచిపోయాయి.
- ఫలితంగా ప్లాంట్ పనులు స్తంభించాయి.

రూ.20కోట్లు కేటాయింపు..

సింగరేణి కార్మిక కుటుంబాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కార్మిక కాలనీలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని పలు కార్మిక సంఘాలు, కాంగ్రెస్ పార్టీ రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి పెంచారు. ఈక్రమంలో ఇటీవల రూ.20కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఆర్జీ–1 ఏరియా జీడీకే–1, 3గని ఫ్యాన్ హౌస్ సమీపంలో 35ఎంఎల్‌డీ సామర్థ్యంతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ప్లాంట్ నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. ఈఏడాది మార్చి 16వ తేదీన సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ ప్లాంట్ పనులకు భూమిపూజ చేశారు. అయితే, రెండు నెలల తర్వాత పనులు ప్రారంభమయ్యాయి.

ప్రతిష్టాత్మకంగా ప్లాంట్ నిర్మాణం..

సింగరేణి యాజమాన్యం అత్యంత ప్రతిష్టాత్మకంగా ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టింది. అయితే, సాంకేతిక కారణాలతో పనుల్లో సుమారు రెండు నెలలు జాప్యం జరిగింది. మ్యాప్‌లు, సాంకేతిక అనుమతుల మంజూరులో పనుల్లో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది.

గడువులోగా పూర్తి చేస్తాం



సాంకేతిక కారణాలతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ప్లాంట్ పనుల్లో జాప్యమైంది. అయినా, ప్రస్తుతం ఫౌండేషన్ పనులు ప్రారంభమయ్యాయి. నిర్దేశిత ఏడాదిలోగా ప్లాంట్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఆర్జీ–1 జీఎం

క్లుప్తంగా

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటయ్య (ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన పెద్ద బత్తుల వెంకటయ్య(38) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. వెంకటయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగానే వెంకటయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు గతంలోనే చనిపోగా, కూతురికి వివాహమైంది. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త..

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన ఎండీ.ముబీన్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ముబీన్ భార్య కొంతకాలంగా కాపురానికి రాకపోవడంతో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై, మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి మజీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి యువకుడి మృతి


అరవింద్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): వ్యవసాయ బావిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఓదెల మండలంలోని జీలకుంటకు చెందిన దొడ్డిపల్లి అరవింద్(20) బుధవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి, గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. అందరూ బుర్రలు కట్టుకొని బావిలో దిగారు. ఈత నేర్చుకుంటుండగా అరవింద్ వీపునకు కట్టుకున్న బుర్ర అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో అతను నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు కేకలు వేయగా గ్రామస్తులు వచ్చేసరికే అరవింద్ చనిపోయాడు. మృతుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి..


భూమయ్య (ఫైల్)

కోరుట్ల రూరల్: జోగిన్‌పెల్లికి చెందిన బూరుగుల భూమయ్య(62) అనే గొర్రెల కాపరి వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. భూమయ్య మంగళవారం గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. ఎండలో తిరగడంతో సాయంత్రం వాంతులు, విరేచనాలు అయ్యాయి. కుటుంబసభ్యులు స్థానికంగా చికిత్స చేయించారు. తగ్గక పోవడంతో రాత్రి కోరుట్ల తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే చనిపోయాడు. మృతుడికి భార్య కాంతమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడు..

వీణవంక(హుజూరాబాద్): కిష్టంపేటకు చెందిన బొద్దుల బాలయ్య(98) ప్రమాదవశాత్తు బావిలో బుధవారం మృతి చెందాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. బాలయ్య బుధవారం సమీపంలోని పొలాల వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో ఆయన మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి, మృతదేహాన్ని బయటకు తీయించారు. బాలయ్యకు మతిస్థిమితం సరిగా ఉండదని, ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడని ఆయన మనవడు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తోటలో పేలిన తూటా

- 'జనశక్తి' వీరన్న ఎన్‌కౌంటర్‌కు పాతికేళ్లు
- తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను చాటిన ఉద్యమ నేత
- తెలంగాణవాది.. దళిత బహుజన పక్షపాతి
- హైదరాబాద్‌లో అరెస్ట్.. నర్సింగాపూర్‌లో ఎన్‌కౌంటర్

సిరిసిల్ల: బహుజన సిద్ధాంతం.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా విప్లవ ఉద్యమాలు రూపొందించారు మారోజు వీరన్న. కులాల ప్రాతిపదికన ఉద్యమించాలని నమ్మి.. సహచరులతో విభేదించి సొంతంగా విప్లవోద్యమాన్ని నిర్మించారు. రెండున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన ఆయనపై ప్రత్యేక కథనం.


మారోజు వీరన్న (ఫైల్)

నర్సింగాపూర్‌లో వీరన్న ఎన్‌కౌంటర్ అయిన మామిడి తోట స్థలం

ఉద్యమనేలలో విప్లవ బీజం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండున్నర దశాబ్దాల కిందట నెత్తురు పారని రోజు లేదు. సమసమాజ స్థాపన కోసం నక్సలైట్లు.. వారిని కట్టడి చేసేందుకు పోలీసులు.. ఇలా జిల్లాలో కాల్పులు.. ఎదురు కాల్పులు నిత్యకృత్యం. నేటి రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పల్లెలు ఆనాడు వామపక్ష ఉద్యమాలకు పురిటిగడ్డలు. ఇక్కడ 'దున్నేవాడికే భూమి' నినాదంతో మొదలైన రైతుకూలి పోరాటం సాయుధ విప్లవోద్యమాలుగా రూపాంతరం చెందాయి. సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత మారోజు వీరన్న ఈ ప్రాంతంలో ఉద్యమాలు రూపొందించారు. 1999, మే16న బోయినపల్లి మండలం నర్సింగాపూర్ శివారులోని మామిడితోటలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరన్న ప్రాణాలు కోల్పోయారు.

పీడీఎస్‌యూ అగ్రనేతగా..

- మారోజు వీరన్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో 1962లో వడ్రంగి కుటుంబంలో జన్మించారు.
- స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య, సూర్యాపేటలో ఇంటర్మీడియెట్, సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ, ఓయూలో ఎమ్మెస్సీ చదివారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.
- 14 ఏళ్ల ప్రాయంలో 'అన్యాయం', 'ఊరు తిరగబడింది' అనే నాటకాలు రాశారు.
- వీరన్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ సీపీఐ(ఎంఎల్) జనశక్తి పార్టీ అగ్రనేత కూర రాజన్నతో కలిసి పనిచేశారు.


తుంగతుర్తి వద్ద వీరన్న స్మారక స్తూపం

- అప్పట్లో మెడికల్, డెంటల్ కాలేజీల్లో క్యాపిటల్ ఫీజులను ప్రభుత్వం విధించడంపై పోరాడి ఆ ఫీజులను రద్దు చేయించారు.
- 1991లో మండల్ కమిషన్ ఉద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు.
- 1994లో కరీంనగర్ జిల్లా చొప్పదండి నుంచి వీరన్న ఎమ్మెల్యేగా పోటీచేసి 22వేల ఓట్లు సాధించారు.

కూర రాజన్నతో విభేదించి..

జనశక్తి పార్టీ అగ్రనేతల్లో ఒకరుగా ఉంటూ వీరన్న కుల, వర్గ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో కులాలు ఉన్నాయని, కుల ప్రాతిపదికన సంఘాలను బలోపేతం చేస్తేనే విప్లవోద్యమాలు బలపడతాయని వీరన్న సూత్రీకరించగా.. జనశక్తి అగ్రనేతలు ఈ వాదనను విభేదించారు. విప్లవ గ్రూపుల్లో కులప్రస్తావన అర్థరహితమని కొట్టిపారేశారు. దీంతో 1995లో చంద్రపుల్లారెడ్డి వర్గంలోని జనశక్తి గ్రూపు నుంచి విడిపోయి జనశక్తి వీరన్న వర్గం, జనశక్తి రాజన్న వర్గంగా(మే 17)న రెండు విప్లవ గ్రూపులు ఏర్పాటయ్యాయి. అప్పటికే ఉమ్మడి కరీంనగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 14 సాయుధ దళాలు వీరన్న వెంట నడిచాయి. జనశక్తి రాజన్న వెంట కేవలం 9 సాయుధ దళాలు ఉన్నాయి. ఫలితంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో వీరన్న వర్గం సాయుధ దళాలు రెండు ఏర్పాటయ్యాయి. ఈక్రమంలోనే జనశక్తి రాజన్నవర్గం, వీరన్న వర్గాల మధ్య అంతర్గత కలహాలు బయటపడ్డాయి. జిల్లాలో అప్పటికే పీపుల్స్‌వార్, జనశక్తి పార్టీలు ఉండగా.. కొత్తగా వీరన్న వర్గం ఏర్పడింది. 1999 జనవరిలో వీరన్న వర్గానికి చెందిన 11 మంది సాయుధులను గంభీరావుపేట మండలం నాగంపేట వద్ద మామిడితోటలో పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఈ సాయుధులను హైదరాబాద్ శివారులో ఓ ఇంట్లో నిర్బంధించి నాగంపేట వద్ద ఎన్‌కౌంటర్ చేసినట్లు అప్పట్లో ఆ పార్టీ ప్రకటించింది. ఈ ఎన్‌కౌంటర్‌తో జనశక్తి వీరన్న వర్గం కార్యకలాపాలు జిల్లాలో సద్దుమణిగాయి. కానీ ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలో పనిచేశాయి.

నర్సింగాపూర్ వద్ద వీరన్న ఎన్‌కౌంటర్

బోయినపల్లి మండలం నర్సింగాపూర్ మామిడి తోటలో 1999, మే 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మారోజు వీరన్న మరణించారు. ఆయనను హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ వినాయక్‌నగర్‌లో పట్టుకొని నర్సింగాపూర్‌కు తెచ్చి ఎన్‌కౌంటర్ చేశారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. పార్టీ కొరియర్ సిద్ధేశ్వర్‌తో కలిసి వెళ్తుండగానే వీరన్నను మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుని మారుతీవ్యాన్‌లో తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అప్పటికే మారోజు వీరన్న రాష్ట్ర సాధన కోసం తెలంగాణ మహాసభలను ఏర్పాటు చేసి సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. విప్లవకారుడిగా, వక్తగా, ఆలోచనపరుడిగా అనేక వ్యాసాలు, పాటలు రాసి, పాడారు. 1989లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్వీ కృష్ణయ్య విజయం సాధించినప్పుడు జగిత్యాలతో ఆత్మీయ సన్మానసభ నిర్వహించారు. ఈ సభలో వీరన్న జనశక్తి శ్రేణులను ఉత్సాహ పరిచేందుకు 'అందుకోర గుప్త అందుకో ఈ దొంగల తరిమేతందుకు' అంటూ.. విప్లవ గీతాలను ఆలపించి సభను ఉర్రూతలూగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను బలంగా చాటిచెప్పారు. వీరన్న రాష్ట్ర సాధన ఉద్యమాన్ని బలంగా తీసుకెళ్తున్న క్రమంలో ఎన్‌కౌంటర్ అయ్యారు.

వీరన్న సంస్మరణ సభలు..

జిల్లాలో వీరన్న సంస్మరణ సభలను ఆయన అభిమానులు, ప్రగతిశీల వాదులు ఏటా నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సభలు సమావేశాలు నిర్వహించి విప్లవ యోధుడికి నివాళి అర్పిస్తారు.

ఆమె నేత్రాలు సజీవం


అహల్యమ్మ (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లికి చెందిన పెరటి అహల్యమ్మ అనే వృద్ధురాలు బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకురాగా, సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ సేకరించారు. ఈ సందర్భంగా అహల్యమ్మ కుటుంబసభ్యులను ఫౌండేషన్ జాతీయ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు కవిత, క్లబ్ కార్యదర్శి శంకర్ అభినందించారు.

కుక్కల దాడిలో మేకలు మృతి


చనిపోయిన జీవాలతో మున్సిపల్ ఆఫీస్‌లో ధర్నా చేస్తున్న అజీజొద్దీన్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి బస్టాండ్ ప్రాంతంలో అజీజొద్దీన్‌కు చెందిన మేకల మందపై బుధవారం మధ్యాహ్నం కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 4 మేకలు చనిపోయాయి. దీనిపై ఆగ్రహించిన యజమాని అజీజొద్దీన్ చనిపోయిన జీవాలతో కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లి, ధర్నాకు దిగారు. తనకు సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందన్నారు. గతంలోనూ 5 మేకలను చంపేయడంతో 9 ఫీట్ల ప్రహరీ నిర్మించానని, అయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు హామీ ఇవ్వడంతో బాధితుడు ఆందోళన విరమించాడు. చికెన్ సెంటర్ల వ్యర్థాలను సేకరించడంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డీజిల్ ట్యాంకర్ పడి ఒకరి దుర్మరణం

- ఏడుగురికి తీవ్ర గాయాలు
- తాడికల్ గ్రామంలో ఘటన


శ్రీనివాస్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): రోడ్డు పక్కనున్నవారిపై డీజిల్ ట్యాంకర్ పడిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు బుధవారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి హాజరైన సీనియర్ ఖోఖో ప్లేయర్ పూదరి శ్రీనివాస్, సాగంటి ప్రకాశ్ నీళ్లు తాగేందుకు వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్తున్నారు. అదే సమయంలో హుజూరాబాద్ వైపు నుంచి అంబాల్‌పూర్ వెళ్లాల్సిన జాతీయ రహదారి నిర్మాణ సంస్థ డీబీఎల్‌కు చెందిన డీజిల్ ట్యాంకర్ రావడంతో రోడ్డు దిగి, పక్కన నిల్చున్నారు. కరీంనగర్ ఆస్పత్రికి, ఇతర పనుల కోసం వెళ్లడానికి ఆర్టీసీ బస్సు కోసం తాడికల్‌కు చెందిన వంగల కనకమ్మ, తాడిచర్ల సంపత్, ఉప్పరి మధురమ్మ, చింతగుట్టకు చెందిన ఆడెపు లాస్య, ఆడెపు మౌనిక, మంద రాజమ్మ అక్కడే చెట్టు కింద కూర్చున్నారు. డీజిల్ ట్యాంకర్ అక్కడికి చేరుకోగానే పక్కకు ఒరిగి, వారిపై పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ ట్యాంకర్ కింద నలిగి, మృతిచెందాడు. మిగతా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

అంతకుముందు మరొకరిని ఢీకొన్న ట్యాంకర్

డీజిల్ ట్యాంకర్ ఈ ప్రమాదానికి ముందు వంకాయలగూడెం వద్ద అదే గ్రామానికి చెందిన జడల రాజయ్యను ఢీకొట్టడంతో అతను గాయపడ్డాడు. గ్రామస్తులు పట్టుకుంటారేమోనన్న భయంతో డ్రైవర్ ట్యాంకర్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. ఆ హడావుడిలోనే తాడికల్ గ్రామంలో స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయడంతో ట్యాంకర్ గ్రామస్తులపై బోల్తా పడింది.


ట్యాంకర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తీయిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ జాం..

సమాచారం అందుకున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఎస్సైలు లక్ష్మారెడ్డి, ఆరోగ్యం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్యాంకర్ నుంచి డీజిల్ కారడంతో రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు జరిపించారు. ఆ సమయంలో ట్యాంకర్ నుంచి డీజిల్ ఎక్కువగా కారడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి, చల్లించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రహదారి సంస్థకు చెందిన సూపర్‌వైజర్‌పై గ్రామస్తులు చేయిచేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రోదిస్తున్న మృతుడి కుమారుడు, కూతురు, సోదరుడు

కూతురిపై లైంగిక దాడి కేసులో తండ్రికి 25 ఏళ్ల జైలు

జగిత్యాల జోన్: కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ కసాయి తండ్రికి 25 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ బుధవారం తీర్పు చెప్పారు. అంతేకాకుండా, బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కథనం ప్రకారం.. కోరుట్ల మండలం ఎఖిన్‌పూర్‌కు చెందిన ఎల్లాల తుకారాం వ్యవసాయం చేసేవాడు. భార్యను కత్తితో పొడిచి, చంపాడు. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. తర్వాత కొడుకు తండ్రితో తెగదెంపులు చేసుకొని, నానమ్మ వద్ద ఉంటున్నాడు. అనంతరం తుకారం రెండో పెళ్లి చేసుకున్నాడు. అతని వేధింపులు భరించలేక ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. తర్వాత, మూడో పెళ్లి చేసుకోగా ఒక కూతురు జన్మించింది. అయితే, అక్టోబర్ 14, 2022న రాత్రి తూకారాం తన భార్య, 12 ఏళ్ల కూతురితో కలిసి భోజనం చేసి, నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బిడ్డ కేకలు విని నిద్ర లేచిన తల్లికి జరిగిన సంఘటనను వివరించింది. దీంతో ఆగ్రహించిన ఆమె భర్తను కోప్పడగా, విషయం ఎక్కడైనా చెబితే ఇద్దరినీ పెట్రోల్ పోసి, చంపుతానని బెదిరించాడు. రెండు రోజులకు వారు తుకారం మొదటి భార్య కొడుకు మహేశ్‌కు చెప్పారు. అతని సహాయంతో కోరుట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్సై సతీశ్ కేసు నమోదు చేయగా, సీఐ రాజశేఖర్ రాజు దర్యాప్తు చేపట్టారు. తూకారాంను అరెస్టు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ సిబ్బంది కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. దీంతో తుకారాంకు న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు

మేడిపల్లి(జగిత్యాల): హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు, జరిమానా విధిస్తూ జగిత్యాల న్యాయస్థానం తీర్పు వెలువరించిందని ఎస్సై శ్యాంరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఓరుగంటి రాజు, పూదరి లక్ష్మణ్.. ఇద్దరిదీ భీమారం మండల కేంద్రం. నాలుగేళ్ల క్రితం పెళ్లి బరాత్‌లో గొడవ పడ్డారు. రాజు క్షణికావేశంలో లక్ష్మణ్‌ను కత్తితో పొడిచి, హత్య చేశాడు. మృతుడి అన్న సతీశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేయగా సీఐ రాజశేఖర్ విచారణ చేపట్టి, కోర్టులో చార్జిషీట్ వేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి బుధవారం రాజుకు జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధించారని ఎస్సై పేర్కొన్నారు.

వికటించిన మహిళా ఆర్‌ఎంపీ వైద్యం

- చావుబతుకుల మధ్య వృద్ధురాలు
- ఎక్కువ రోజులు బతకదన్న వైద్యులు
- ఇంటికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు

మానకొండూర్ రూరల్: మహిళా ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి, ఓ వృద్ధురాలు చావుబతుకుల మధ్య ఉంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. లింగాపూర్ గ్రామంలోని రాంనగర్ బేడబుడిగ జంగాల కాలనీకి చెందిన భూపతి కనకవ్వకు ఈ నెల 2న జ్వరం వచ్చింది. దీంతో ఆమె కుటుంబసభ్యులు వైద్యం కోసం స్థానిక ఆర్‌ఎంపీ మమతను ఇంటికి పిలిపించారు. కనకవ్వను పరీక్షించిన ఆమె, గ్లూకోజ్ పెట్టి, అందులో ఇంజెక్షన్ కలిపి వెళ్లిపోయింది. 30 నిమిషాల తర్వాత ఆ వృద్ధురాలి శరీరంపై దద్దుర్లు, బొబ్బలు రావడంతో ఆర్‌ఎంపీకి సమాచారం ఇచ్చారు. ఆమె మళ్లీ వచ్చి, ఇంకో ఇంజెక్షన్ వేసి, వెళ్లిపోయింది. 20 నిమిషాల తర్వాత కనకవ్వ నాలుక లావై, కాళ్లూచేతులు చచ్చుబడిపోయాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి, 6 రోజులు చికిత్స చేయించారు. అక్కడినుంచి మరో దవాఖానాలో చేర్పించారు. కనకవ్వ ఎక్కువ రోజులు బతకదని వైద్యులు నిర్ధారించడంతో మంగళవారం రాత్రి ఇంటికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. బాధితురాలి కుమారుడు రమేశ్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.


వారం క్రితం చికిత్స పొందుతున్న కనకవ్వ

పెట్రోల్ బంకు సమీపానికి మంటలు

- ఆర్పివేసిన పోలీసులు
- బంధంపల్లిలో తప్పిన ప్రమాదం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు బంధంపల్లిలో బుధవారం ఓ రైతు తన పొలంలో వరికొయ్యలకు నిప్పుపెట్టాడు. మంటలు చెలరేగి, స్థానిక పెట్రోల్‌బంకు సమీపంలోకి రావడాన్ని గమనించిన ఏఎస్సై రామస్వామి పోలీస్ సిబ్బంది శరత్, శ్రీకాంత్, డ్రైవర్ శ్రీనివాస్‌తో కలిసి వాటిని అదుపు చేస్తూనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోగా మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరగకుండా చూసిన పోలీసులను పలువురు అభినందించారు.


మంటలను ఆర్పుతున్న పోలీసులు

విద్యుత్ సేవల్లో పెద్దపల్లి టాప్


సుదర్శనం, ఎస్ఈ.

పెద్దపల్లిరూరల్: ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంలో మనజిల్లా అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం తెలిపారు. అదేవిధంగా అధికారులు, సిబ్బంది మెరుగైన పనితీరు కనబర్చి మంచి ర్యాంక్‌లు సాధించారని అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చెందిన ఏఈ సైఫుద్దీన్‌కు ప్రథమ ర్యాంక్ వచ్చిందన్నారు. ఆపరేషన్, మెయింటనెన్స్‌లో ఫోర్‌మెన్ వరకు ఏఈ, సబ్‌ఇంజినీర్.. ఇలా అన్ని విభాగాల సహకారంతోనే జిల్లాకు ఈ గౌరవం దక్కిందని ఎస్ఈ పేర్కొన్నారు. మేలో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్నా.. ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసే సత్వరమే మంజూరు చేస్తామని తెలిపారు.

జేవీ చలపతిరావుకు మాతృవియోగం


సూరమ్మ (ఫైల్)

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ జేవీ చలపతిరావు తల్లి సూరమ్మ(90) బుధవారం హైదరాబాద్‌లోని అల్వాల్‌లో మరణించారు. సిరిసిల్ల భూపోరాట ఉద్యమంలో, రైతాంగ పోరాట నిర్మాణంలో చలపతిరావుకు బాటలు వేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన జువ్వాడి సూరమ్మ, మురళీమనోహర్‌రావు దంపతుల కొడుకు చలపతిరావు. ఆయన విద్యార్థి దశలోనే ఉద్యమాల వైపు సాగాడు. సీపీఐ(ఎంఎల్) జనశక్తి ఉద్యమంలో కీలక నాయకుడిగా ఎదిగారు. మూడు దశాబ్దాలపాటు అజ్ఞాత జీవితం గడిపారు. 1994లో అజ్ఞాతవాసం వీడి, సిరిసిల్ల ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆయన తల్లి సూరమ్మ సిరిసిల్ల ప్రాంతంలో కరుడుగట్టిన భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ముందునిలిచారు. దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ప్రజాపోరాటాలకు సూరమ్మ సాక్షిభూతమయ్యారు. సూరమ్మ హైదరాబాద్‌లోని తన చిన్నకుమారుడి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు గురువారం ఉదయం 9 గంటలకు అల్వాల్ శ్మశానవాటికలో నిర్వహించనున్నారు. సూరమ్మ మృతిపై రాజన్నసిరిసిల్ల జిల్లా సీపీఐ కార్యదర్శి గుంటి వేణు సంతాపం ప్రకటించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని మల్యాలకు చెందిన యెల్ల రమేశ్ బుధవారం ద్విచక్రవాహనంపై చందుర్తి వెళ్తున్నాడు. మల్యాల బస్టాండ్‌లో చందుర్తి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

గుంజపడుగులో ప్రహరీ వివాదం

- ఇరు కుటుంబాల మధ్య గొడవ
- ఇల్లు ధ్వంసం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు

గొల్లపల్లి(ధర్మపురి): ప్రహరీ విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలవగా, ఒకరి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఎస్సై సతీశ్‌కుమార్ వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలంలోని గుంజపడుగుకు చెందిన కళ్లెం తిరుపతి, పస్తం శారద ఇళ్ల మధ్య ప్రహరీ ఉంది. దీని గురించి కొంతకాలంగా ఇరుకుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతంలో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం మాటామాట పెరిగి, తిరుపతి శారద ఇంటిపై దాడి చేసి, ఆమెను దూషించాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులు సైతం గొడవకు దిగారు. ఇరుకుటుంబాల వారు కర్రలతో దాడి చేసుకునేవరకు వెళ్లారు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సంఘటనలో తిరుపతి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. విషయం పోలీసులకు తెలియడంతో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై సతీశ్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అప్పటికే శారద సోదరులు సమ్మయ్య, పోచయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతి, తిరుమలేశ్, శ్రీకాంత్‌తోపాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


ధ్వంసమైన ఇల్లు


గ్రామంలో పోలీస్ పికెట్